సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 24 । మే । 2025



చెరువుల అభివృద్ధేది?
గత ఐదేళ్లుగా చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవటంతో ఆయకట్టు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. 10లో



కొండరెడ్లకు గృహ నిర్మాణాలు
అటవీ ప్రాంతాల్లోని కొండరెడ్లకు పీఎం జన్‌ధన్ పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు అందించాలని పీఓ రాహుల్ అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
34°/ 26°

వాతావరణం
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం కొన్ని చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలంకరణలో రామయ్య దర్శనం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు శుక్రవారం స్వర్ణకవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకం చేశారు. ముందుగా అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశాక నివేదన, హారతి, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. అనంతరం కుంకుమపూజ, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలోఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

కోచ్‌ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై ఏడాది కాలానికి కోచ్‌లను నియమించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. కిన్నెరసానిలో మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఆర్చరీ కోచ్, కాచనపల్లిలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో కబడ్డీ కోచ్ ఎంపికకు ఎన్ఐఎస్, ఎన్ఐఎస్‌లో డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ధ్రువపత్రాలతో ఈనెల 26నుంచి జూన్ 3వ తేదీ వరకు ఐటీడీఏలోని స్పోర్ట్స్ ఆఫీసర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా కానీ dtdo.bhadradri@gmail.com మెయిల్ ద్వారా కానీ దరఖాస్తులు పంపించాలని సూచించారు. వివరాలకు 98489 88205, 99123 62053 నంబర్లకు సంప్రదించాలని పీఓ తెలిపారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి



లైసెన్స్‌లు పొందిన యువతతో ఎస్పీ, ఎస్సై

కొత్తగూడెంఅర్బన్: గిరిజన ప్రాంతాల్లో నివసించే యువత అన్ని రంగాల్లో ముందుండాలి ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని కొండరెడ్ల గ్రామమైన పూసుకుంటకు చెందిన 12 మంది యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించగా.. శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు, మైదాన ప్రాంతాల్లోని వలస గిరిజన యువతకు తమ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. క్రీడా పోటీల నిర్వహణ, ఉద్యోగాలు సాధించేందుకు శిక్షణ వంటివి ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువత డ్రైవింగ్ లైసెన్స్‌లు లేక వాహన తనిఖీల్లో పట్టుబడుతున్నారని, అందుకే లైసెన్స్‌లు ఇప్పించేందుకు తమ శాఖ ముందుకొచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఎంబీబీఎస్–2 ఖాళీ వైద్య పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా డీసీహెచ్ఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. నెలకు వేతనం రూ.52,351 చెల్లించనున్నట్లు తెలిపారు.

తనిఖీకొస్తే తంటాలే..!

తనిఖీల పేరుతో పంచాయతీరాజ్ శాఖలో ఓ సబ్ డివిజన్ స్థాయి అధికారి వ్యవహారశైలి జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లడం.. అక్కడ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అంటూ 'సుదీర్ఘ' ఉపన్యాసాలు దంచడం, ఆ తర్వాత తన కోరికల చిట్టాను బయటపెట్టడం.. కాదంటే 'నీ పని ఖతం' అంటూ కన్నెర్ర చేయడం ఆ అధికారి నైజం కావడమే ఇందుకు కారణం.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

రికార్డుల పరిశీలన పేరుతో ఓ అధికారి హంగామా

- ప్రత్యేక భోజనం.. 'స్పెషల్ కవర్' ఇవ్వాలని డిమాండ్
- ఆ అధికారి తనిఖీలంటేనే వణుకుతున్న సెక్రటరీలు
- తిరుగుబాటుకు సిద్ధమవుతున్న పంచాయతీ కార్యదర్శులు



తనిఖీల పేరుతో దందా..

పంచాయతీరాజ్ విభాగంలో ఓ ఉన్నత స్థాయి అధికారి తనిఖీల పేరుతో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తూ పంచాయతీ కార్యదర్శులను ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం నివురుగప్పిన నిప్పులా మారింది. సదరు అధికారి ఏ గ్రామానికి పర్యటనకు వెళ్లాలని అనుకుంటున్నాడో.. ఆ సమాచారాన్ని ముందుగానే పంచాయతీ కార్యదర్శులకు చేరవేస్తారు. తాను వచ్చిపోయేందుకు వీలుగా కారులో డీజిల్ ఫుల్ ట్యాంక్ చేయడానికి రూ.3,000 ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. తనిఖీలు పూర్తయ్యాక లంచ్ లేదా డిన్నర్‌లో నాటుకోడి పులుసు, చేపల ఫ్రై కచ్చితంగా ఉండాల్సిందే. భోజనం చేసి కారు ఎక్కేటప్పుడు కనీసం రూ.10,000 నగదుతో కూడిన కవరు అందజేయాల్సి ఉంటుంది. ఇందులో ఏ చిన్న మార్పు జరిగినా సదరు అధికారికి చిర్రెత్తుకొస్తుంది. 'నీ పని తీరు బాగా లేదని రిపోర్టు రాస్తా'నంటూ బుసలు కొడతాడు. నిర్దేశిత షెడ్యూల్ తప్పినందుకు జరిమానాతో సహా ముడుపులు చెల్లిస్తే తప్ప సదరు అధికారి శాంతించడు.

నిబంధనల పేరుతో బెదిరింపులు..

పల్లె పరిపాలన ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ఇందులో రోజువారీ కార్యక్రమాల వివరాలు ఎప్పటిప్పుడు అప్‌లోడ్ చేయాలి. ఈ యాప్‌లో వివరాలు సరిగా నమోదు చేస్తున్నారా లేదా అని తెలుసుకోవాల్సిన బాధ్యత సబ్ డివిజనల్ స్థాయి అధికారులది. ప్రతీ నెల కనీసం 16 గ్రామాలకు వెళ్లి యాప్ పనితీరును పరిశీలించాలి. దీన్ని ఓ అధికారి అక్రమార్జనకు, గొంతెమ్మ కోరికలు తీర్చుకోవడానికి ఆయుధంగా ఉపయోగిస్తున్నాడని పంచాయతీరాజ్ శాఖ కోడై కూస్తోంది.

తప్పులెంచుతూ.. తన పని కానిస్తూ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు ఇంటి పన్ను వసూలు ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం సమకూర్చుకుంటాయి. ఇంటి పన్నుల ద్వారా వచ్చిన నిధులను ట్రెజరీలో జమ చేయాల్సి ఉంటుంది. గ్రామ పరిపాలనకు ఖర్చు చేసిన మొత్తాలను బిల్లుల రూపంలో ట్రెజరీలో సమర్పిస్తే అక్కడి నుంచి చెక్కుల రూపంలో విడుదలవుతాయి. పంచాయతీ ఎన్నికలు జరగకపోవడంతో రెండేళ్లుగా కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయి. రాష్ట్ర సర్కారు సైతం నిధుల మంజూరులో జాప్యం చేస్తోంది. ట్రెజరీలో బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. కానీ పారిశుద్ధ్య నిర్వహణకు ఉపయోగించే ట్రాక్టర్, వీధి దీపాలకు డబ్బులు అత్యవసరం అవుతున్నాయి. అంతేకాక గ్రామసభలు, శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, జాతీయ పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల కోసం అప్పటికప్పుడు డబ్బులు అవసరం పడుతున్నాయి. దీంతో ఇంటి పన్నుల ద్వారా వసూలైన డబ్బును తప్పనిసరి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు ట్రెజరీ ద్వారా కాకుండా నేరుగా ఖర్చు పెట్టక తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలోని ఇతర సబ్ డివిజన్లలోనూ అనధికారికంగా ఇదే జరుగుతోంది. అలాగే గ్రామ పరిపాలనకు సంబంధించి పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం మొత్తం 72 రకాల రికార్డులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో రోజు, వారం, పక్షం, నెలరోజుల వారీగా వివరాలు నమోదు చేయాల్సిన రికార్డులు ఉన్నాయి. ఈ రికార్డుల నిర్వహణలో సహజంగానే కొంత ఆలస్యం జరుగుతుంది. కానీ సదరు అధికారి క్షేత్రస్థాయి పర్యటనలో రికార్డుల నిర్వహణ, నిధుల వినియోగంలో పారదర్శకత లేదంటూ లోపాలను ఎంచుతూ పంచాయతీ కార్యదర్శులపై బెదిరింపులకు పాల్పడుతున్నాడు. డ్యూటీ ఎలా చేయాలనే అంశంపై 'సుదీర్ఘ' ఉపన్యాసాలు దంచుతున్నాడు. చివరకు తన కారుకు ఫుల్‌ట్యాంక్, నాటుకోడి, ఫిష్‌ఫ్రై, రూ.10,000 కవర్ సమర్పిస్తే అంతా 'రైట్' అంటూ వెళ్లిపోతున్నాడు.

ఇక భరించలేం..

నిధులు మంజూరు కాక పంచాయతీల నిర్వహణ కోసం ఇప్పటికే రూ.లక్షల అప్పులు తెచ్చామని, సదరు అధికారి తీరుతో మరింత ఒత్తిడికి లోనవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ఒక్కసారి తనిఖీ అంటే 'మానేజ్' చేయగలరు కానీ పదే పదే కొందరినే టార్గెట్ చేస్తుండటంతో పరిస్థితి చేయిదాటిపోతోంది. దీంతో సదరు అధికారిపై రేపో మాపో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం, లేదంటే ఏసీబీని ఆశ్రయించాలనే ఆలోచనలో బాధితులు ఉన్నట్లు సమాచారం.

కనెక్షన్లు పైపైకి..

- జిల్లాలో 56,789 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు
- దరఖాస్తు చేసుకున్న వెంటనే ఇస్తామంటున్న అధికారులు
- ఏడాదిలోనే 52 శాతం పెంపు



సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతుల సాగు భూములకు నీరందించేందుకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం.. సర్వీసుల సంఖ్య పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే కనెక్షన్ ఇచ్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణం, ఎక్కువ ఏజెన్సీ ప్రాంతం ఉన్న జిల్లాలో 90 శాతానికి పైగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలే ఉన్నాయి. ఇందులో ఎకరం, అంతకంటే తక్కువ భూములు ఉన్న గిరిజనులు చాలా మంది ఉన్నారు. ఈ క్రమంలో రైతులు అడిగిన వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసేలా ఆ శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

పారదర్శక సేవల కోసం..

జిల్లాలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2023తో పోల్చితే 2024లో 52 శాతం కనెక్షన్లు పెరగడం విశేషం. ప్రస్తుతం 56,789 సర్వీసులు ఉన్నాయని విద్యుత్ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. సర్వీసుల మంజూరుకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా సరిపడా మెటీరియల్‌ను అధికారులు సిద్ధంగా ఉంచుతున్నారు. అవసరమైన ప్రదేశాల్లో స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. రైతులు దరఖాస్తు చేసుకోగానే వాటిని ఆన్‌లైన్ చేస్తున్నారు. తద్వారా పారదర్శకంగా సేవలందించే అవకాశంతో పాటు రైతులు తమ దరఖాస్తుల స్టేటస్‌ను అగ్రికల్చర్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

పెండింగ్‌లో 637 దరఖాస్తులు..

2024 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు జిల్లాలో 4,963 మంది రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. గతేడాది ఏప్రిల్‌లో 404, మే నెలలో 343, జూన్ 405, జూలై 370, ఆగస్టు 288, సెప్టెంబర్ 111, అక్టోబర్ 346, నవంబర్ 383, డిసెంబర్ 428, ఈ ఏడాది జనవరి 425, ఫిబ్రవరి 438, మార్చి 491, ఏప్రిల్‌లో 531 విద్యుత్ కనెక్షన్లు ఇవ్వగా ఇంకా 637 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

సత్వర మంజూరుకు చర్యలు



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సత్వర మంజూరుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్ విధానంతో తమ దరఖాస్తులు ఎక్కడ పెండింగ్‌లో ఉన్నాయో రైతులు తెలుసుకునేలా అగ్రికల్చర్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం. కనెక్షన్లు పొందిన రైతులు సాగునీటి అవసరం మేరకే మోటార్లను వినియోగించాలి. ఎక్కువ సేపు మోటార్లు ఆన్ చేసి ఉంచితే విద్యుత్‌తో పాటు సాగునీరు వృథా అవుతాయి. మోటార్ల వినియోగంలో అధికారుల సూచనలను జాగ్రత్తలను పాటించాలి.

–జి.మహేందర్, విద్యుత్ ఎస్‌ఈ

పెద్దబోటు సిద్ధం

పాల్వంచరూరల్ : కిన్నెరసాని జలాశయంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న పెద్ద బోటు 15 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో హైదరాబాద్ నుంచి మెకానిక్‌లను పిలిపించి ఎట్టకేలకు రిపేర్ చేయించగా.. శుక్రవారం పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది. దీంతో పలువురు పర్యాటకులు ఉత్సాహంగా బోట్ షికారు చేశారు.



పెద్ద బోట్‌లో విహరిస్తున్న పర్యాటకులు

కాయకల్ప బృందం పరిశీలన

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కాయకల్ప బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. స్వచ్ఛత, సదుపాయాలు, బయో మెడికల్ వేస్టేజ్, ఇన్ఫెక్షన్ కంట్రోల్, పారిశుద్ధ్య, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి తదితర అంశాలపై పరిశీలించారు. ఆస్పత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గత నెలలోనే కాయకల్ప ఇంటర్నల్ పీర్ అసెస్మెంట్ జరగగా, అందులో క్వాలిఫై కావడంతో ఎక్సటర్నల్ అసెస్మెంట్ జరిగింది. ఇందులో ప్రథమ ర్యాంక్ వస్తే రూ. 15 లక్షలు, ద్వితీయ ర్యాంక్ వస్తే రూ.10 లక్షలతో పాటు ఇందులో పాల్గొన్నందుకు రూ.లక్ష రివార్డు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు డాక్టర్ నిరంజన్, శ్రీకాంత్ రాజు, రాధిక శర్మ, స్వామి, ఆస్పత్రి వైద్యులు రాజశేఖర్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న బృందం సభ్యులు

అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలి

డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసరమైన మందులను అన్ని వేళల్లో అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని చిట్టి రామవరం బస్తీ దవాఖానా, పాత కొత్తగూడెంలోని ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు అందించాలని అన్నారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాకేష్, అజయ్, పాయం శ్రీనివాస్, హెచ్ఈఓ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

నకిలీ విత్తనాలపై దృష్టి పెట్టాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎస్పీ రోహిత్‌రాజు, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దృష్టి సారించాలని, వాటిని అరికట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఇన్‌పుట్ డీలర్లకు కలెక్టర్, ఎస్పీ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు సంతకాలు చేసిన బిల్లులు ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలనే సరఫరా చేయాలని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు, ఇంటర్నల్ స్క్వాడ్, మండల క్వాలిటీ ఇన్‌స్పెక్టర్, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. సదస్సులో అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యాచందన, కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, డీసీఓ ఖుర్షీద్, డీహెచ్ఎస్ఓ కిశోర్, డీఏఓ వి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు చదువే ప్రధానం

దివ్యాంగులైన పిల్లలకు చదువే ప్రధానమని కలెక్టర్ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాంటి చిన్నారులకు డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్, స్పెషల్ ఎడ్యుకేషన్, ఐఈడీ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఇక దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు మంజూరు చేస్తామని, ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులకు పని కల్పిస్తామని అన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ర్యాంపులు నిర్మిస్తామన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా అంత్యోదయ కార్డులు, బ్యాటరీ ఆపరేటర్ సైకిళ్ల రిపేర్లకు టెక్నీషియన్లను నియమిస్తామని చెప్పారు. వయోవృద్ధులకు ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అన్ని మండలాల్లో ఆయుర్వేదిక్ శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్సీ అభివృద్ధి అధికారి డి. అనసూర్య, ఏడీఎంహెచ్ఓ ఎస్.జయలక్ష్మి, మెప్మా పీడీ సీహెచ్. రాజేష్, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, పరిశ్రమల అధికారి మధుసూదన్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి ఇందిర, సీపీఓ కె సంజీవరావు, ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి హెచ్‌ఎంలే మూలస్తంభాలు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ విద్యా రంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, వారే మూలస్తంభాల్లాంటి వారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న వృత్యంతర శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. హెచ్‌ఎంలు మనసుపెట్టి పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదని, పాఠశాలల్లో సమాజ భాగస్వామ్యం పెంచుతూ పిల్లలకు నాణ్యమైన బోధన అందించాలన్నారు. అంతకుముందు పాతపాల్వంచలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. జీవశాస్త్రం చదవడంటే డాక్టర్‌గా స్థిరపడడమే అనే ఒక అపోహ నుంచి విద్యార్థులు బయటపడేలా చూడాలని, ఎన్నో వినూత్నమైన కోర్సులను అధ్యయనం చేస్తూ మానవాళికి అవసరమైన సహజసిద్ధ ఆహార పదార్థాలను మొక్కల ద్వారా అందించొచ్చని చెప్పారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, జీవశాస్త్ర శిక్షణా కేంద్ర ఇన్‌చార్జ్ ఎ. పద్మలత, రాష్ట్ర పరిశీలకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు తిప్పలెన్నో..

- అధికారుల చుట్టూ ప్లాట్లదారుల ప్రదక్షిణలు
- నిషేధిత స్థలం కాకున్నా జాబితాలోకి..
- యజ్ఞంలా మారిన పరిశీలన, అనుమతులు

ఖమ్మం అర్బన్: స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ప్రవేశపెట్టగా దరఖాస్తులదారుల వెసులుబాటు కోసం ఇటీవల ఫీజులో 25శాతం రాయితీ ప్రకటించింది. దీంతో తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవచ్చని, తద్వారా నిర్మాణానికి ఇక్కట్లు తీరతాయని భావించిన దరఖాస్తుదారులకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. గతంలో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారిని ప్రస్తుతం నిర్దేశిత ఫీజులో 25 శాతం రాయితీకి అర్హులుగా ప్రకటించారు. కానీ ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సాంకేతిక సమస్యలో లేక ఇతర కారణాలో తెలియదు కానీ యజమానులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫీజు చెల్లింపునకు అనుమతి జారీ కావడం లేదు.

దశల వారీగా...

ఎల్–1 దరఖాస్తులకు సంబంధించి కార్పొరేషన్ లేదా గ్రామపంచాయతీ అధికారులతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంతా సవ్యంగా ఉంటే యాప్‌లో అప్‌లోడ్ చేసి అనుమతి ఇస్తున్నారు. కానీ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మూడు శాఖల అధికారులకు ఒకేసారి సమయం లభించి క్షేత్రస్థాయికి వస్తేనే ప్లాట్ ప్రభుత్వ భూమిలో ఉందా, ఎఫ్‌టీఎఫ్ పరిధిలో ఉందా అనేది నిర్ధారించే అవకాశముంటుంది. ఇందుకోసం దరఖాస్తుదారులు అధికారుల చుట్టూ తిరిగి యాప్‌లో నమోదు చేయించుకున్నా... తిరిగి మరోమారు అనుమతి కోసం క్షేత్రస్థాయికి రావాల్సి ఉండడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదంతా పూర్తయ్యాక ఎల్–2(టౌన్ ప్లానింగ్), ఎల్–3(ముఖ్య అధికారి జారీ చేసే పత్రం) దశల్లోనూ విపరీతమైన జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. ఇదంతా భరించలేక కొందరు తాము చెల్లించిన డబ్బు తిరిగి ఇచ్చేయాలని అధికారులను నిలదీస్తున్నట్లు సమాచారం. ఇదే అదనుగా కొందరు అంత దూరం రావాలంటే ఖర్చులు అవుతాయని డబ్బు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



ప్లాట్ వద్దే యాప్‌లో ఫొటో అప్‌లోడ్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

రెండేసి సార్లు

కొన్ని ప్లాట్లకు సమీపాన ప్రభుత్వ భూమి అసైన్డ్ భూములు లేదా వాగులు, వర్రెలు ఉంటే ఈ భూమిని కూడా నిషేధిత(ప్రొహిబిటెడ్) జాబితాలో చేర్చినట్లు సమాచారం. ఎప్పుడో కొనుగోలు చేసిన ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చడం ఏమిటని ప్లాట్ల యజమానులు వాపోతున్నారు. ఇలాంటి ప్లాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాకే రాయితీతో ఫీజు చెల్లింపునకు అనుమతి ఇస్తుండడం గమనార్హం. అంతా పూర్తయి ఫీజు చెల్లించినా అనుమతి పత్రం కోసం మరోమారు ఉన్నతాధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుండడం గమనార్హం.

మీ సేవ కేంద్రాలకు పరుగులు

ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలోనే యజమానులు అన్ని పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కానీ ఇప్పుడు మరోమారు అప్‌లోడ్ చేయాలని ప్లాట్లదారులకు సమాచారంవస్తోంది. దీంతో నెట్ సెంటర్లు, మీ సేవ సేవా కేంద్రాలకు పరుగులు తీయక తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఫీజు చెల్లింపునకు అవకాశం ఇవ్వాలని, ఆ వెంటనే అనుమతులు జారీచేయాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ప్లాంటేషన్ నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు



గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజారావు

అశ్వాపురం: అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధి తుమ్మలచెరువు బీట్‌లోని పాలవాగు సమీపంలో ప్లాంటేషన్ నరికివేతపై అటవీశాఖ అధికారులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుర్నాపల్లి కొత్తూరుకు చెందిన కొందరు గిరిజనులు రెండు రోజులుగా ఫారెస్ట్ అధికారులు నిర్ణయించిన కందకాలు దాటి ప్లాంటేషన్‌లోని చెట్లను నరికివేస్తున్నా రు. దీంతో అటవీశాఖ సిబ్బంది రెవెన్యూ, పోలీసులు దృష్టికి తీసుకెళ్లగా, తహసీల్దార్ రాజారావు, ఎస్సై ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని గిరిజనులతో మాట్లాడి పోడు నరకవద్దని సూచించారు. అనంతరం ప్లాంటేషన్ నరికివేతకు పాల్పడిన వారిని ఫారెస్ట్ సిబ్బంది ఫిర్యాదు మేరకు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ రమేష్ , సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, మణుగూరు సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించాలి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

జూలూరుపాడు: రహదారుల పక్కన ఇంకుడు గుంతలు నిర్మించాలని డీపీఓ చంద్రమౌళి సూచించారు. శుక్రవారం ఆయన జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాల్లో తల్లాడ-కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కన, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించి మాట్లాడారు. ఇంకుడు గుంతలు నిర్మించడం వల్ల వర్షపు నీరు నేలలోకి ఇంకి భూగర్భజల మట్టం పెరుగుతుందని, నీటి కొరత తగ్గుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎంపీఓ టి.తులసీరామ్, వెంగన్నపాలెం పంచాయతీ సెక్రటరీ జి లక్ష్మణ్, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్ శంకర్

దమ్మపేట: బోధనలో నూతన పద్ధతులు పాటించాలని జిల్లా స్థాయి విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ శంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని, బోధనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బోధనలో ఏఐ విధానాలను జోడించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమికస్థాయి గణిత బోధనలో సీపీఏ పద్ధతి అనుసరించాలని, పాఠ్యాంశాల బోధనలో ఎక్కువగా కృత్యధార పద్ధతులను ఉపయోగించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కీసర లక్ష్మి, ఎంఆర్పీలు రామకృష్ణ, రవి, ప్ర భాకర్, షారోన్ కుమార్, సౌమ్య, కృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

తల్లాడ: మండలంలోని మల్లవరంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంభగిరి బలరాం (45) దళిత కాలనీ సమీపాన ఉన్న చికెన్ షాపు వెనకాల మూత్ర విసర్జనకు వెళ్లాడు. అయితే, ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ వైర్‌ను తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మధ్యాహ్నం ఆయన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. బలరామ్‌కు భార్య సుశీల, ఇద్దరు పిల్లలు ఉండగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

17 మందికి జరిమానా

కొత్తగూడెంఅర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందికి శుక్రవారం కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు జరిమానా విధించారు. కొత్తగూడెం వన్ టౌన్, అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు. దీంతో న్యాయమూర్తి విచారణ చేపట్టి జరిమానా విధించారు.

చెరువుల అభివృద్ధేది?

- ఐదేళ్లుగా నిలిచిన పూడిక తీత పనులు
- అలుగులు, తూములకు మరమ్మతులు
- మిషన్ కాకతీయ తర్వాత చెరువుల అభివృద్ధికి గ్రహణం



మిషన్ కాకతీయ పథకంలో ఎంపికైన చెరువులో పూడిక తీస్తున్న జేసీబీ(ఫైల్)

బూర్గంపాడు: చెరువుల్లో మట్టి పూడికలతో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. తూములు, అలుగులు మరమ్మతులకు గురై నీటి వృథా జరుగుతోంది. చెరువు కట్టలు బలహీనపడి తరుచూ తెగిపోతున్నాయి. దీంతో పంట చివరి దశలో నీరు సరిపోక పైర్లు ఎండుతున్నాయి. ఐదేళ్లుగా చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవటంతో ఆయకట్టు రైతులకు ఇబ్బందులు తప్పటం లేదు.

2015 నుంచి 2019 వరకు..

గత ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ కోసం మిషన్ కాకతీయ పథకాన్ని అమలు చేసింది. 2015 మార్చి 12న ఈ పథకం ప్రారంభించగా, 2019 వరకు ప్రతి ఏటా వేసవిలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఏళ్ల తరబడి చెరువులలో పూడుకుపోయిన మట్టిని యంత్రాలతో తీయించారు. సారవంతమైన ఆ మట్టిని రైతులు పంట భూములలో వేసుకున్నా రు. చెరువులకు కొత్తతూములు వేయించారు. అలుగులను పునర్నిర్మించారు. చెరువు కట్టలపై మట్టిపోసి పటిష్టపరిచారు. దీంతో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి పంటలకు ఉపయోగపడింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని మెచ్చుకుంటూ పలు అవార్డులు అందించింది. వివిధ ప్రభుత్వ శాఖలు కూడా చెరువులను దత్తత తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లాలో 1850 పైగా పెద్ద, చిన్న చెరువులు ఉండగా, ఈ పథకంలో 870 చెరువులను అభివృద్ధి చేశారు. చిన్న చెరువులను ఉపాధిహామీ పథకంలో కొంతమేర అభివృద్ధి చేశారు.

2019 తర్వాత పట్టించుకోలేదు..

నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 తర్వాత మిషన్ కాకతీయ పథకాన్ని పెద్దగా కొనసాగించలేదు. నాటి నుంచి నేటి వరకు చెరువుల అభివృద్ధి పనులు ఎక్కడ కూడా జరగటం లేదు.ఐదేళ్ల క్రితం వర్షాలకు, భారీ వరదలకు మట్టి కొట్టుకొచ్చి మిషన్ కాకతీయ పథకంలో అభివృద్ధి చేసిన చెరువుల్లో పూడిక పేరుకుపోయింది. వరద ఉధృతికి అలుగులు మరమ్మతులకు గురయ్యాయి. తూములు లీకయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా చెరువుల అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవటంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పూడిక మట్టిని రైతులు చేలలోతోలుకునేందుకు కూడా ఎక్కువ ఖర్చవుతుండటంతో రైతులు ఆ ప్రయత్నాలను మానుకున్నారు. గత వానాకాలం సీజన్ చివరిలో చెరువులలో నీరు లేకపోవటంతో రైతులు పంటను కాపాడుకునేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. దూరంలో ఉన్న బోరుబావుల నుంచి పైప్‌లైన్లు వేసుకుని పంటలు కాపాడుకున్నారు. ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పూడిక తీయాలి



చెరువుల్లో పూడిక మట్టి తీస్తే ఓ విడత తడికి నీరు అదనంగా అందుతుంది. వానాకాలం వరి పొట్టదశలో చెరువుల్లో నీరు అడుగంటడంతో ఇబ్బందులు పడ్డాం. పూడిక తీతలో వచ్చే మట్టిని చేలలో వేసుకుంటే మూడేళ్ల పంటలు బాగా పండుతాయి. ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

–వై.నర్సింహారెడ్డి, రైతు, రెడ్డిపాలెం

అభివృద్ధి చేయాలి



గతంలో మాదిరి ప్రభుత్వం చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. మిషన్ కాకతీయలో చెరువులు అభివృద్ధి చేయటంతో ఐదేళ్ల ఇబ్బందులు లేకుండా పంటలు పండాయి. గతేడాది భారీ వర్షాలు, వరదలకు చెరువులలో మళ్లీ పూడిక చేరింది. మళ్లీ చెరువులలో పూడికలు తీయిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

–బి.లోక్యా, రైతు, కృష్ణసాగర్

వల పన్ని.. పట్టుకున్నారు!

- స్టేషన్‌లో ఎఫ్‌ఓబీ పైనుంచి దూకేందుకు ఛత్తీస్‌గఢ్ యువకుడి యత్నం
- కాపాడిన పోలీస్, అగ్నిమాపక శాఖ సిబ్బంది



బ్రిడ్జి కింద వలతో సిద్ధంగా ఉన్న ఉద్యోగులు



లలిత్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో ఖమ్మం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం హల్‌చల్ చేశాడు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పైనుంచి దూకేందుకు యత్నించడం కలకలం రేపింది. ఈ ఘటనతో సుమారు గంటపాటు గందరగోళం నెలకొనగా, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చివరకు ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది చొరవతో కింద వలలు ఏర్పాటుచేసి.. ఆ యువకుడిని తోసేయడంతో వలపై పడగా అంతా ఊపిరిపీల్చుకున్నారు.

మద్యం మత్తు.. కుటుంబ కలహాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు లలిత్ బరిహ ఖమ్మం సమీపాన గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో మద్యం సేవించిన ఆయన ఆత్మహత్య చేసుకుంటానంటూ శుక్రవారం రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రెండో నంబర్ ప్లాట్‌ఫాం మీదుగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపైకి ఎక్కి దూకడానికి యత్నించాడు. బ్రిడ్జి కింద హైపర్ టెన్షన్ విద్యుత్ వైరు ఉండడం, అదే సమయానికి సికింద్రాబాద్‌కు వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రానుండడంతో వేచి ఉన్న ప్రయాణికులు లలిత్‌ను గమనించి ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ సురేశ్‌గౌడ్ ఆధ్వర్యాన సిబ్బంది చేరుకుని ఎంత నచ్చజెప్పినా వినకపోగా, పైకి ఎవరైనా వస్తే దూకుతానని బెదిరించాడు. ఆపై ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చి, బ్రిడ్జిపైకి ప్రయాణికులు వెళ్లకుండా ఆపివేశారు. ఇంతలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వస్తుడడంతో ఖమ్మం ఔటర్‌లోనే నిలిపివేశారు. ఆ తర్వాత అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని బ్రిడ్జి కింద వలలతో సిద్ధమయ్యారు. ఇదంతా సుమారు గంట దాటడంతో ఆర్పీఎఫ్ సిబ్బంది ఒకరు పైకి వెళ్లి లలిత్ తీగలపై పడకుండా వలలో పడేలా కిందకు తోశాడు. దీంతో ఆయన నేరుగా వలలో సురక్షితంగా పడటంతో ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించారు. కాగా, లలిత్ తీరుతో రైళ్లు నిలిచిపోవటంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, ఆయన ప్రాణాలు కాపాడిన ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఫైర్ సిబ్బందిని పలువురు అభినందించారు.

చెట్టు పైనుంచి పడి డీఆర్‌సీసీ కార్మికుడి మృతి !

అశ్వాపురం : మణుగూరు నుంచి అశ్వాపురంలోని హెవీ వాటర్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేసే డీఆర్‌సీసీ కంపెనీలో పనిచేసే కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి మృతిచెందాడని సమాచారం. పాములపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు వీరయ్య అలియాస్ శెట్టి ప్రేమ్‌దాస్(62) గౌతమీనగర్ కాలనీలోని కంపెనీకి చెందిన ఓ అధికారి ఇంట్లో పనులు చేసే క్రమంలో శుక్రవారం చెట్టు ఎక్కాడని, ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడని తెలిసింది. అయితే ఈ విషయాన్ని బయటకు రానివ్వకుండా గోప్యంగా ఉంచుతున్నట్లు సమాచారం. దీనిపై స్థానిక ఎస్సై మధుప్రసాద్‌ను వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గ్యాస్ లీకేజీతో మంటలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రోటరీనగర్‌లోని ఓ ఇంట్లో శుక్రవారం గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. ఇంట్లో నివాసముంటున్న వారు వంట చేసే క్రమాన స్టవ్ వెలిగించగా అప్పటికే గ్యాస్ లీక్ అయి ఉండడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన వారు సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చి నీళ్లు చల్లినా మంటలు అదుపులోకి రాలేదు. అప్పటికే అందిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

భార్యపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న లావణ్య

కొత్తగూడెంఅర్బన్: ఓ వ్యక్తి తన భార్యపై కత్తితో దాడి చేసిన ఘటన శుక్రవారం జరిగింది. లక్ష్మీదేవిపల్లి పోలీసుల కథనం ప్రకారం.. వైరాకు చెందిన మాధవరావు, లావణ్య దంపతులు. భర్త మాధవరావుకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉన్నదనే కారణంతో లావణ్య కొంతకాలంగా లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్‌నగర్‌లోని తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మాధవరావు అత్తగారి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పెట్టుకున్నాడు. కత్తితో గొంతుపై గాయపరిచాడు. అడ్డు వచ్చిన అత్తను కూడా గాయపరిచాడు. లావణ్యకు రక్తస్రావం అవుతుండగా కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఆరుగురికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రంగా, మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బోయితండా గ్రామపంచాయతీ సేవ్యాతండా గ్రామానికి చెందిన గంగావత్ మోహన్ ఖమ్మంలోఆర్టీసీ డ్రైవర్‌గా ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రామంలో ఓ శుభకార్యానికి హా జరై తిరిగి భార్య లలిత, కుమార్తె రాజేశ్వరిలతో కలిసి బైక్‌పై ఖమ్మం బయలుదేరాడు. అదే సమయంలో ధనియాలపాడు గ్రామానికి చెందిన చరణ్, సాగర్, శ్రావ్య ముగ్గురు బైక్‌పై ఇల్లెందు నుంచి కొమరారం వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో మోహన్, లలిత, రాజేశ్వరిలు తీవ్రంగా గాయపడ్డారు. చరణ్, సాగర్,శ్రావ్యలకు స్వల్పంగా గాయాలయ్యాయి.క్షతగాత్రులను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మంసిఫారసు చేశారు. బాధితుల ఫిర్యాదుమేరకుఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు.

13 తులాల బంగారం చోరీ

దుకాణంలో సిబ్బంది కళ్లుగప్పి అపహరణ



సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

మణుగూరు టౌన్: పట్టణంలోని ఓ దుకాణంలో సిబ్బంది ఉండగానే కళ్లుగప్పి చోరీకి పాల్పడిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అంబేద్కర్ సెంటర్ వద్ద ఉండే శ్రీవారి బంగారు దుకాణంలో మధ్యాహ్నం ఓ వ్యక్తి ప్రవేశించి దుకాణం సిబ్బంది ఉండగానే షో కేసులో ఉన్న బంగారు నగలు అపహరించి తన వెంట తెచ్చుకున్న చేతి సంచిలో వేసుకుని పరారయ్యాడు. కొద్దిసేపటికి 13 తులాల బంగారం చోరీ అయినట్లు గుర్తించిన యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మేడా ప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా, చోరీ దృశ్యం రికార్డయినట్లు తేలింది. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



రాధమ్మ(ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన జూలూరుపాడు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం సతీమణి చీమలపాటి రాధమ్మ(48) రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. రాధమ్మ తల్లి ఇటీవల మృతి చెందగా గురువారం మధిర మండలం జాలిమూడిలో దశదిన కర్మలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భిక్షం, రాధమ్మ దంపతులు బైక్‌పై వెళ్లి తిరిగొస్తున్నారు. ఈ క్రమంలో వైరా మండలం విప్పలమడుగు గ్రామం వద్ద రాధమ్మ లోబీపీతో కళ్లు తిరిగి కిందపడిపోయింది. దీంతో తీవ్ర గాయాలుకాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ రాధమ్మ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాధమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బూర్గంపాడు: మండల పరిధిలోని మోతె పట్టీనగర్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం... ఇరవెండి గ్రామానికి చెందిన లకావత్ గాంధీ(28) గురువారం రాత్రి సారపాక నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోతెపట్టీనగర్ గ్రామం వద్ద రోడ్డుపై అడ్డంగా వస్తున్న గేదెను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో గాంధీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాల వ్యాపారి ఆత్మహత్య

మణుగూరు టౌన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ పాలవ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ముత్యాలమ్మనగర్‌కు చెందిన పోట్ల ప్రసాద్(46) పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఆయన మనస్తాపం చెంది గురువారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు 100 పడకల ఆస్పత్రికి, అక్కడి నుంచి భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నందకిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మణుగూరు ఎస్ఐ మనీష తెలిపారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి

అశ్వారావుపేటరూరల్: మాజీ ఉప సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కోనేరుబజార్‌కు చెందిన దామెరశెట్టి నీలాచలం(75) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నీలాచలం అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీకి 2004 నుంచి 2008వ సంవత్సరం వరకు ఉప సర్పంచ్‌గా పని చేశారు.

కొండరెడ్లకు గృహ నిర్మాణాలు

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అటవీప్రాంతంలో నివసిస్తున్న కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు పీఎం జన్‌ధన్ పథకం కింద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఎంపీడీఓలు ప్రతిపాదనలు అందజేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దమ్మపేట, అశ్వారావుపేట మండలాల ఎంపీడీఓలు, కొండరెడ్ల గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అశ్వారావుపేట మండలంలోని ఏడు హ్యాబిటేషన్లు, దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామంలోని కొండరెడ్ల గిరిజన కుటుంబాల ఇంటింటికి తిరిగి మొబైల్‌యాప్ ద్వారా సర్వే చేయాలని ఆదేశించారు. శనివారం నుంచి సర్వే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు సీతారామ జలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ జలాలు జిల్లా సాగు భూములకు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని 48.30 కి.మీ. వద్ద కూలిన పాసేజ్ పిల్లర్ ప్రదేశాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. నాసిరకం నిర్మాణం వల్లే పిల్లర్ కూలిందని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన కాలువలతోపాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణాలు తక్షణమే పూర్తి చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నవరపు కనకయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, జిల్లా నాయకుడు కొండబోయిన వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, గొగ్గెల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కటకటాల్లోకి కర్ణాటక కేటుగాడు

డిజిటల్ అరెస్ట్ పేరిట జిల్లా వాసి నుంచి రూ.1.12 కోట్లు స్వాహా

ఖమ్మంక్రైం: మనీ లాండరింగ్ కేసు నమోదైంది.. డిజిటల్ అరెస్ట్ చేస్తున్నాం.. అంటూ బెదిరిస్తూ జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.1.12 కోట్లు కాజేసిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన నిందితుడిని ఖమ్మం సైబర్ విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలతో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం టీచర్స్‌కాలనీకి చెందిన నాగుల బ్రహ్మంకు గత ఏడాది అక్టోబర్‌లో ఫోన్ చేసిన అజ్ఞాత వ్యక్తి మనీలాండరింగ్ కేసు నమోదైందంటూ నకిలీ డాక్యుమెంట్లను వీడియోకాల్‌లో చూపించారు. ఇలా భయపెడుతూనే కేసు నుంచి బయట పడేయడానికి డబ్బు చెల్లించాలని పలు దఫాలుగా రూ.1.12 కోట్లు వివిధ ఖాతాల్లోకి జమ చేయించుకున్నాడు. చివరకు మోసపోయినట్లు గుర్తించిన బ్రహ్మం ఫిర్యాదుతో ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీకి చెందిన మహ్మద్ జాఫర్ బెల్గాంను నిందితుడిగా గుర్తించి అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. ఆపై ట్రాన్సిట్ వారెంట్ ద్వారా ఖమ్మం తీసుకొచ్చి కోర్టులో హాజరుపర్చినట్లు సీపీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్, ఎస్ఐలు రంజిత్, విజయ్‌కుమార్, ఉద్యోగులను సీపీ అభినందించారు.

జేఏసీ పోరుబాటలో భాగస్వాములు కావాలి

మధిర/బోనకల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాల్లో ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావాలని పీఆర్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు సూచించారు. మధిరలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని పరిశీలించడంతోపాటు బోనకల్ మండలం రావినూతల పాఠశాలలో శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. హక్కుల కోసం పోరాడుతూనే బడిబాటలో భాగంగా విద్యార్థుల సమోదు పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. కాగా, పీఆర్‌సీ అమలు, పెండింగ్ డీఏల సాధన కోసం యూనియన్ తరఫున కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే, విద్యారంగ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరిచేలా ఉండొద్దనేది తమ విధానమని తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా మాజీ అధ్యక్షుడు మోత్కూరి మధు పాల్గొన్నారు.

సెలవుల్లోనే బదిలీలు పూర్తిచేయాలి

నేలకొండపల్లి: ప్రస్తుత వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నేలకొండపల్లిలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, 2008 డీఎస్సీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని కోరారు. కాగా, ఉపాధ్యాయులు సైతం ఈ నెల 25 నుంచి జరిగే బడిబాట ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషిచేయాలని తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్రి వెంకన్న, జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, జిల్లా కార్యదర్శి సురేశ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్యోతి, టి.గురవయ్య, డి.అరుణ పాల్గొన్నారు.